సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



ఆయిల్‌పామ్ సాగు పెంచేలా..

దేశంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర వ్యవసాయశాఖ కమిషనర్ పీకే సింగ్ తెలిపారు. 8లో ▸




నిట్‌లో సీట్ల కోత

ఏపీ నిట్‌లో ఈ ఏడాది 270 సీట్లకు కోతపడింది. నిట్‌కు రెగ్యులర్ డైరెక్టర్ లేకపోవడం, ఫ్యాకల్టీ కొరత వంటివి సీట్లపై ప్రభావం చూపాయి. 8లో ▸

నేడు ఆట్యా-పాట్యా సెలెక్షన్స్

ఆట్యా-పాట్యా జూనియర్స్ బాలబాలికల జిల్లా జట్లను శుక్రవారం భీమవరం ఎస్‌సీహెచ్‌బీ ఆర్‌ఎమ్ స్కూల్ ఆవరణలో ఎంపిక చేయనున్నారు. 8లో



న్యూస్‌రీల్

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి కోరారు. స్థానిక కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో గురువారం ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాశ్వత లోక్‌అదాలత్, వచ్చే నెల 9న జరిగే జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై శాశ్వత న్యాయపీఠం చైర్మన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు న్యాయవాదులు అవగాహన కల్పించాలన్నారు. న్యాయపీఠం చైర్మన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ రవాణా, పోస్టల్, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, విద్యా, వైద్య, జాతీయ ఉపాధి హామీ, రియల్ ఎస్టేట్ మొదలైన సేవల్లో లోపం జరిగిన కేసులపై శాశ్వత లోక్ అదాలత్‌లో అర్జీ చేసుకోవచ్చన్నారు. ఇందుకు ఎటువంటి రుసుం వసూలు చేయరన్నారు. కౌన్సెలింగ్ ద్వారా రాజీ చేసి కేసులను పరిష్కరిస్తామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌కు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు సహకరించాలని కోరారు.

పదోన్నతితో పెరిగిన బాధ్యత



డీఐజీని కలిసిన పోలీసు అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో 20 మంది ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన పోలీసు అధికారులు గురువారం ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందనీ, ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించాలని, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలని డీఐజీ వారికి సూచించారు.

నేడు ఉద్యోగుల స్పందన

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భీమవరం కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగుల స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రతినెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల సర్వీసు, వ్యక్తిగత, ఇతరత్రా ఫిర్యాదులు సమర్పించవచ్చని ఆమె సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఈ-జిల్లా, ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టుల నియామకానికి పొరుగు సేవల పద్ధతిలో దరఖాస్తులు కోరుతున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, భీమవరం డివిజన్‌లో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులకు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, పూరించి సంబంధిత విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జతచేసి ఈనెల 25లోపు జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.22,500 వేతనం చెల్లిస్తారని, రాత పరీక్ష, ఇంటర్వ్యూలను జిల్లా కమిటీ నిర్వహిస్తుందని తెలిపారు. ఐటీ రంగంలో రెండేళ్ల అనుభవం కలిగి సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలో ఐదు శాతం వెయిటేజ్ ఇస్తామని, 21 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. బీసీఏ, బీఎస్సీ, బీఈ, బీటెక్, మాస్టర్స్ డిగ్రీలో ఏదైనా కలిగి ఉండటంతో పాటు ఆంగ్లంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగి ఉండాలని తెలిపారు.

ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి పోలింగ్, కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి, అడిషనల్ జిల్లా ఎన్నికల అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. జిల్లాలోని 3 సర్పంచ్, 21 వార్డు సభ్యుల స్థానాలకు ఈనెల 19న పోలింగ్ జరుగనుందని, ఈ మేరకు 33 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేయగా 11,114 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు. వీరిలో పురుష ఓటర్లు 5,444, మహిళా ఓటర్లు 5,670 మంది ఉన్నారన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు పెంచడంతో పాటు సూక్ష్మ పరిశీలకులను నియమించామని, మొత్తంగా సుమారు 160 సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారన్నారు.

నగదు రహితం.. సులభతరం

- పంచాయతీల్లో ఆన్‌లైన్ లావాదేవీలు
- మరింత మెరుగైన పాలనకు చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 953 పంచాయతీల్లో అమలు
- బ్యాంకు ఖాతాలు, క్యూఆర్ కోడ్‌లు అందజేత





చొదిమెళ్ల గ్రామ సచివాలయం

ఏలూరు(మెట్రో): ప్రజలకు మరింత పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువచేసింది. అలాగే అవినీతిరహిత లావాదేవీలు చేపట్టేందుకు పంచాయతీల్లో నగదురహిత కార్యకలాపాలకు ఉపక్రమించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి ఆన్‌లైన్, క్యూఆర్‌కోడ్‌ల ద్వారా లావాదేవీలు చేపట్టేలా చర్యలు తీసుకుంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారులు రెండు జిల్లాల్లోని అన్ని పంచాయతీల పరిధిలో నగదు రహిత లావాదేవీలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. నగదురహితం ద్వారా అవినీతికి తావులేకుండా ప్రజలకు సేవలు అందించేందుకు సిబ్బందికి సైతం శిక్షణ ఇచ్చారు. కేవలం ప్రచార ఆర్భాటానికే కాకుండా నగదు రహిత లావాదేవీలు చేపట్టేందుకు జిల్లాలోని అన్ని పంచాయతీలకు బ్యాంకు ఖాతాలను ప్రారంభింపజేసి, అలాగే ఆయా బ్యాంకు ఖాతాలకు సంబంధించి క్యూఆర్ కోడ్‌లను సైతం అందించారు. ఇకపై పంచాయతీల పరిధిలో ప్రజలు ఇంటి, కుళాయి, ప్రకటన పన్నులు వంటివి ఆన్‌లైన్ ద్వారా సులభంగా చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఏలూరు జిల్లాలో 547 పంచాయతీలో పరిధిలో బ్యాంకు ఖాతాలను ప్రారంభించి 547 బ్యాంకు ఖాతాలకు అనుసంధానంగా 547 క్యూఆర్ కోడ్‌లను, పశ్చిమగోదావరి జిల్లాలో 406 పంచాయతీలకు గాను 406 బ్యాంకు ఖాతాలను ప్రారంభింపచేసి 406 క్యూఆర్‌కోడ్‌లను అందించారు. ఇక నుంచి ఆయా బ్యాంకు ఖాతాల్లో నేరుగా ప్రజలు పన్నుల సొమ్ములు జమచేసేలా చర్యలు తీసుకున్నారు.

సులభంగా పన్నుల చెల్లింపు

ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రస్తుతం ఎటుచూసినా నగదు రహితమే కొనసాగుతోంది. ప్రజలు ఏది కొనాలన్నా, ఏది తినాలన్నా నగదుతో పనిలేకుండానే కేవలం బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు ఉంటే సరిపోయేలా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటివి ఉపయోగించి నగదును సులభతరంగా బదిలీ చేస్తున్నారు. అలాగే పంచాయతీల్లో కూడా లావాదేవీలు జరిపేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రజల ముంగిళ్లలోనే సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇకపై పన్నుల సొమ్ములను గడప వద్దే ప్రజలు క్యూఆర్‌కోడ్ ద్వారా చెల్లించే సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిద్వారా ప్రజలు సులభంగా పన్నులు చెల్లించడంతో పాటు అవినీతికి తావులేకుండా సేవలు పొందవచ్చు.

జిల్లా	పంచాయతీలు	క్యూఆర్ కోడ్‌లు
ఏలూరు	547	547
పశ్చిమగోదావరి	406	406

ప్రజల సౌకర్యార్థం



ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా నగదుతో పనిలేకుండా నేరుగా పన్నులు చెల్లించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ఏలూరు జిల్లావ్యాప్తంగా బ్యాంకు ఖాతాలను ప్రారంభించి పంచాయతీలకు క్యూఆర్ కోడ్‌లను సైతం అందించాం. ఈనెల 15 నుంచి ఈ విధానం అమలులోకి వచ్చింది. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, అవినీతికి తావులేకుండా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం.

– తూతిక శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా పంచాయతీ అధికారి, ఏలూరు

పారదర్శకంగా ఓటర్ల జాబితా పరిశీలన

కలెక్టర్ ప్రశాంతి



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వీరవాసరం: పారదర్శకంగా ఇంటింటా ఓటర్ల జాబితా పరిశీలన పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం మండలంలోని నందమూరిగరువు గ్రామ సచివాలయం, మండల పరిషత్ పాఠశాలలో 173, 174 పోలింగ్ స్టేషన్లు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ సచివాలయంలో రిజిస్టర్లు పరిశీలించి ఓటర్ల చేర్పులు, మార్పులపై సిబ్బందికి సూచనలిచ్చారు. రెండు శాతం కంటే ఎక్కువ చేర్పులు, మార్పులు ఉంటే తహసీల్దార్లు కచ్చితంగా పరిశీలించాలన్నారు. పక్కాగా ఓటర్ల సర్వే చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషక పదార్థాలు, కోడిగుడ్లను పరిశీలించి సూచనలిచ్చారు. మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం అందించాలన్నారు. గ్రామంలోని పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి మౌలిక వసతులను పరిశీలించారు. ఓటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎం.సుందరరాజు, ఎంపీడీఓ కె.జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ కేవీ సుబ్బారావు, ఆర్‌ఐ వై.రూజ్‌వెల్ట్, బీఎల్‌ఓలు, సచివాలయం, రెవెన్యూ, ఐసీడీఎస్ సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

‘మార్గదర్శి’లో సీఐడీ సోదాలు

కీలకపత్రాలు, రికార్డుల తనిఖీలు



తణుకులో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయం

ఏలూరు టౌన్: ఏలూరు ఎన్‌ఆర్‌పేటలోని మార్గదర్శి కార్యాలయంలో సీఐడీ అధికారులు సోదాలు చేశారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. సీఐడీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ ఇతర శాఖల అధికారులతో కలిసి మార్గదర్శిలోని రికార్డులను మరోమారు తనిఖీ చేశారు. ఏలూరు, తణుకు, భీమవరంలోని మార్గదర్శి కార్యాలయాల్లో సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మార్గదర్శి బ్రాంచ్‌లకు సంబంధించి ప్రధాన సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవటంతో రికార్డులు తనిఖీ చేసినట్లు తెలుస్తోంది.

తణుకులో..

తణుకు: తణుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయంలో మరోసారి సీఐడీ అధికారులు సోదాలు చేపట్టారు. గతంలో పలు పర్యాయాలు సోదాలు నిర్వహించిన సీఐడీ అధికారులు గురువారం ఉదయం నుంచి కార్యాలయంలో పలు రికార్డులతో పాటు కీలక డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన ఈ సోదాలు రాత్రి పొద్దుపోయేవరకు కొనసాగాయి. సుమారు పది మంది అధికారుల బృందం ఈ తనిఖీల్లో ఉన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, ఫైర్, మున్సిపల్, విజిలెన్స్, చిట్‌ఫండ్స్ రిజిస్ట్రార్ తదితర శాఖలకు చెందిన అధికారులు ఈ సోదాలు చేపట్టారు. ముఖ్యంగా ఖాతాదారులకు సంబంధించిన డిపాజిట్లు, చెక్కులు పరిశీలించిన అధికారులు డిపాజిట్లపై చెల్లిస్తున్న వడ్డీ రేట్లపై ఆరా తీసినట్లు సమాచారం. ఈ డిపాజిట్లను వేరేచోట పెట్టుబడులు పెట్టారా అనే అంశంపై ఆరా తీసినట్లు తెలిసింది.

మహిళాభ్యున్నతి లక్ష్యం

ఏలూరు (టూటౌన్): మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి తద్వారా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎంఎస్‌డీ భూషణం అన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం దళిత ఆదివాసీ మహిళలకు, అధికారులకు ముఖాముఖి కార్యక్రమాన్ని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా భూషణం మాట్లాడుతూ బ్యాంకు లింకేజ్ ద్వారా అందుతున్న రుణాలతో చిరు, సూక్ష్మ వ్యాపారాలు చేసి అభివృద్ధి సాధించాలని మహిళలను కోరారు. జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ వాణి మాట్లాడుతూ నిరుద్యోగులు సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వివిధ తరహాల్లో రాయితీలు ఉన్నాయన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అజయ్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మరిన్ని రుణాలు అందించాలన్నారు. డీబీఆర్‌సీ రీజనల్ కో-ఆర్డినేటర్ జె.రమాదేవి మాట్లాడుతూ బ్యాంకు బీమా పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. డీబీఆర్‌సీ జిల్లా అధ్యక్షురాలు సింగవరపు జ్యోతి, పశు సంవర్ధకశాఖ వైద్యులు జ్యోతి స్వరూప, వైస్ డైరెక్టర్ ఎస్.లక్ష్మీకుమారి, ఏఐడీఆర్‌ఎఫ్ చైర్మన్ ఆర్.మణిసింగ్, కార్పొరేటర్ టి.అరుణకుమారి, డీబీఆర్‌సీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణమాఫీని ఎగ్గొట్టిన చంద్రబాబు

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ధ్వజం



డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ చెక్కు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: డ్వాక్రా రుణమాఫీ చేస్తానని రూ.14 వేల కోట్లు ఎగ్గొట్టి మహిళలను చంద్రబాబు మోసం చేశారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ధ్వజమెత్తారు. స్థానిక లక్ష్మీప్రియ ఎస్టేట్ మున్సిపల్ పార్కులో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సున్నావడ్డీ చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 లక్షల మంది మహిళల ఉసురు ఊరికే పోదని, 2014లో మహిళల ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీని విస్మరించి అన్యాయం చేశారన్నారు. చంద్రబాబు తిరిగి ఎప్పటికీ అధికారంలోకి రాలేడన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేయడంతో పాటు సున్నా వడ్డీకి రుణాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.25 వేల కోట్లు రుణమాఫీ, రూ.7 వేల కోట్ల సున్నావడ్డీ లబ్ధిని మొత్తంగా రూ.32 వేల కోట్ల ప్రయోజనం చేకూర్చారన్నారు. అలాగే 72 వేల ఎకరాలు కొనుగోలు చేసి 32 లక్షల మందికి స్థలాలు మంజూరు చేసి గృహనిర్మాణాలకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెంలో 5,376 ఏపీ టిడ్కో గృహాలను అక్టోబరు 2 నాటికి పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందచేస్తామన్నారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు రూ.42 కోట్లు ఏపీటిడ్కో సంస్థకు మంజూరు చేశామన్నారు.

ఓర్వలేకే కుట్రలు :

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దఎత్తున సంక్షేమం అందిస్తుంటే చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని మంత్రి కొట్టు విమర్శించారు. వైఎస్సార్‌సీపీని ఓడిస్తామని అంటున్నారు గాని తాము గెలుస్తామని ఎక్కడా చెప్పలేకపోవడం వారి అపనమ్మకాన్ని వెల్లడిస్తుందన్నారు. తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను నిలిపివేస్తామని చెప్పడం ప్రజలపై వారి దుర్నీతిని తెలియజేస్తోందన్నారు. ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో 4,844 డ్వాక్రా గ్రూపులకు నాలుగో విడత సున్నా వడ్డీ చెక్కు రూ.7.40 కోట్లను అందజేశారు. అనంతరం సీఎం జగన్, మంత్రి కొట్టు చిత్రపటాలకు మహిళలు క్షీరాభిషేకం చేశారు. తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, ఎంపీడీఓ విశ్వనాథం, కొలుకులూరి ధర్మరాజు, గుండుబోగుల నాగు, కొట్టు విశాల్, ఎంపీపీ దాసరి హైమావతి, కైగాల శ్రీనివాస్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు బి.రామలక్ష్మి, కర్రి భాస్కరరావు, అడపా దుర్గేష్, నూనె రాధ, ముప్పిడి సంపత్‌కుమార్, గుండుమోగుల సాంబయ్య, మానికొండ వెంకటేశ్వరరావు, సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఏలూరు(మెట్రో): జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పర్యావరణ ప్రణాళిక సలహా కమిటీ సభ్యుల సమావేశాన్ని ఏలూరు జిల్లా పొల్యూషన్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాలు, బయోమెడికల్ వ్యర్థాలు, ప్రమాదకర వ్యర్థాలు, ఈ-వ్యర్థాల నిర్వహణ, నీటి నాణ్యత, మురుగునీటి శుద్ధి, వాయు నాణ్యత ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ మార్గదర్శకాలపై చర్చించి కలెక్టర్ సూచనలు చేశారు. పొల్యూషన్ శాఖ ఈఈ కె.వెంకటేశ్వరరావు, ఏఈ మహ్మద్ నజీనాబేగం, జెడ్పీ సీఈఓ రవికుమార్, పరిశ్రమల శాఖ మేనేజర్ పి.ఏసుదాసు, పాల్గొన్నారు.

ఫోన్ పోయిందా.. దిగులు పడొద్దు

- సెల్‌ఫోన్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా రికవరీ
- జిల్లాలో 2,400 ఫిర్యాదులు
- ఇప్పటివరకు 801 ఫోన్ల స్వాధీనం
- వీటి విలువ రూ.1.20 కోట్లు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు (ఫైల్)



పాలకొల్లులో రికవరీ చేసిన ఫోన్లను అందిస్తున్న ఎస్పీ రవిప్రకాష్ (ఫైల్)

సాక్షి, భీమవరం: సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వర్రీ కాకండి. ఫోన్ కొనుగోలు చేసిన ఆధారాలతో పోలీసులకు వాట్సాప్ మేసేజ్ ద్వారా ఫిర్యాదు చేస్తే కొద్దిరోజుల్లోనే పైసా ఖర్చులేకుండా మీ చెంతకు చేరుతుంది. పోలీసు శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన సెల్‌ఫోన్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎవరైనా, ఎంత దూరంలో వినియోగిస్తున్నా సులభంగా కనిపెడుతున్నారు. వాటిని రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2,400 సెల్‌ఫోన్ మిస్సింగ్ ఫిర్యాదులు అందగా సుమారు రూ.1.20 కోట్ల విలువైన 801 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

కొందరే పోలీస్‌స్టేషన్లకు.. ప్రస్తుతం సెల్‌ఫోన్ లేనిది ఎటువంటి కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగం పెరిగింది. వీటి ఖరీదు అధికంగా ఉంది. సెల్‌ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకుంటే ఆ బాధ వర్ణనాతీతం. ఖరీదైన ఫోన్ పోయిందనే బాధతోపాటు ఫోన్‌లో నిక్షిప్తమైన ఫోన్ నంబర్లు, సమాచారం పొందడం కష్టంగా మారింది. దీంతో ఫోన్ పోగొట్టుకున్న వారు తన ఫోన్ ఎక్కడైనా పడిపోయిందా.. లేదా ఎవరైనా దొంగిలించారా అనే సందేహంతో సతమతమవుతుంటారు. దీనిపై కొందరు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తుండగా మరికొందరు మిన్నకుండి పోతున్నారు. దీంతో సెల్‌ఫోన్ దొరికిన వారు లేదా దొంగిలించిన వారు ఆ ఫోన్ తమదేనన్న ధీమాతో వినియోగించుకుంటున్నారు.

వాట్సాప్‌కు మెసేజ్ చేస్తే.. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారికి పోలీసు శాఖ మంచి అవకాశం కల్పించింది. పోగొట్టుకున్న ఫోన్ వివరాలను 91549 66503 వాట్సాప్ నంబర్‌కు ‘హాయ్’ అనే మెసేజ్ చేస్తే చాట్‌బోట్ మెసేజింగ్ పద్ధతి ద్వారా ఒక లింక్ ఆటోమెటిక్‌గా వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలతోపాటు ఫోన్ వివరాలను పొందుపరిస్తే సెల్‌ఫోన్‌ను గుర్తిస్తారు. దీనికి గాను జిల్లాలో ఎస్పీ యు.రవిప్రకాష్ ప్రత్యేక సెల్‌ఫోన్ ట్రాకింగ్ బృందాన్ని ఏర్పాటుచేశారు. ఈ బృందంలో దిశా పోలీసు స్టేషన్‌కు సంబంధించిన ఎస్సైతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లు, ఐడీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది పనిచేస్తున్నారు. బృంద సభ్యులు తమ రోజువారి విధి నిర్వహణతోపాటు ఫోన్ల రికవరీని కూడా చేస్తున్నారు. పోలీసులు రికవరీ చేసిన ఫోన్లలో ఇతర రాష్ట్రాల్లో వినియోగిస్తున్న ఫోన్లు కూడా ఉండటం విశేషం.

నా ఫోన్ దొరికింది



మోటారు సైకిల్‌పై భీమవరం నుంచి నిడదవోలు వెళ్తుండగా ఒక వ్యక్తి లిఫ్ట్ అడిగి నా ఫోన్ దొంగిలించాడు. నిడదవోలు స్టేషన్‌లో కంప్లయింట్ చేశాను. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫోన్ పోగా వెతికి పట్టుకుని జూన్‌లో అందజేశారు. పోయిన ఫోన్ దొరకడం ఆనందంగా ఉంది.

– షేక్ బాషా, భీమవరం

సెల్‌ఫోన్ ట్రాకింగ్ బృందం ద్వారా..

సెల్‌ఫోన్ దొరికితే పోలీసుస్టేషన్లలో అందజేయాలి. అక్రమంగా వినియోగించినా, ఆధారాలు లేకుండా కొనుగోలు చేసినా ఇబ్బందులు తప్పవు. జిల్లాలో సెల్‌ఫోన్ ట్రాకింగ్ బృందం ఏర్పాటుచేసిన తర్వాత ఇప్పటివరకు రూ.1,20,15,000 విలువైన 801 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశాం. ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు ఒకసారి ఫిర్యాదు చేసి మిన్నకుండి పోకూడదు. కొన్నిరోజుల తర్వాత మరలా ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

– యు.రవిప్రకాష్, ఎస్పీ, భీమవరం

ఉపాధ్యాయ సర్దుబాటులో మినహాయింపులు



మాట్లాడుతున్న డీఈఓ శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయుల జీతాల విషయంలో పొజిషన్ ఐడీ లేకపోవడంతో ఆలస్యమయ్యాయని, రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ అన్నారు. పని సర్దుబాటు ప్రక్రియపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, హిందీ భాషల విషయంలో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నందున సర్‌ప్లస్ లేదన్నారు. 117 జీఓపై చిన్నపాటి మార్పులకు కమిషనర్‌తో చర్చించి పరిష్కరిస్తామన్నారు. పదవీ విరమణ ఏడాదిలోపు ఉన్నవారికి, పీహెచ్‌సీల విషయంలో 75 శాతానికి పైబడిన వైకల్యం ఉన్నవారికి సర్దుబాటులో మినహాయింపు ఇస్తామని, మిగిలిన వారి విషయంలో కూడా పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు. పని సర్దుబాటు ప్రక్రియ తొలుత కాంప్లెక్స్ తర్వాత మండల, డివిజన్ స్థాయిల్లో చేపడతామన్నారు. బదిలీ కోరుకుని రిలీవర్ లేక ఇప్పటికీ ఉన్న 47 మందిని రిలీవ్ చేస్తామని, వారి స్థానంలో పని సర్దుబాటు చేస్తామన్నారు. మిగిలిన సర్‌ప్లస్ ఉపాధ్యాయులను ఎక్కడా అవసరం లేకపోతే ప్రస్తుతం చేస్తున్న చోటే ఉంచేస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై నారాయణపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. నారాయణపురం టూరింగు పేట నుంచి జనార్ధనరావు బైక్‌పై వస్తుండగా.. తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న వ్యాను ఢీకొంది. ప్రమాదంలో వ్యాను డ్రైవరు శ్రీనుకు, జనార్ధనరావుకు గాయాలు కాగా హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిట్‌లో సీట్ల కోత

- మొత్తం 270 సీట్లను తగ్గిస్తూ నిర్ణయం
- రెగ్యులర్ డైరక్టర్ లేకపోవడంతో ఇక్కట్లు
- సరిపడా ఫ్యాకల్టీ లేకపోవడం మరో కారణం



తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లో ఈ ఏడాది మొత్తం 270 సీట్లకు కోతపడింది. హోం స్టేట్ కోటాలో ఏకంగా ఏపీ విద్యార్థులు 135 మంది, అదర్ స్టేట్ కోటాలో దేశ వ్యాప్తంగా మరో 135 మంది విద్యార్థులు ఏపీ నిట్‌లో చేరే అవకాశం లేకుండా పోయింది. రెగ్యులర్ డైరెక్టర్ లేక పోవడం విద్యార్థులకు శాపంగా మారింది. డైరక్టర్ లేకపోవడం, ఫ్యాకల్టీ కొరత వంటివి సీట్లపై ప్రభావం చూపింది. ఏపీ నిట్‌కు ఇంతకుముందు డైరెక్టర్‌గా వ్యవహరించిన సీఎస్‌పీ రావు పలు ఆరోపణలు ఎదుర్కొన్న నేపథ్యంలో సస్పెండయ్యారు. ఆ తర్వాత రెగ్యులర్ డైరెక్టర్ ఇప్పటివరకు లేరు. నిట్ ఫైలుపై చిన్న సంతకం కావాలన్నా ఇన్‌చార్జిగా ఉన్న నాగపూర్ నిట్ డైరెక్టర్ కోసం కూడా నాగపూర్ వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఈ ప్రభావం నిట్ అభివృద్ధిపై నేరుగా పడింది. ఈ విద్యాసంవత్సరంలో నిట్‌లో ఉండే 750 సీట్లలో 270 సీట్లకు కోత పడింది.

అభివృద్ధిలో దూసుకుపోతున్న సమయంలో

ఏపీ నిట్ దూసుకెళ్తున్న తరుణంలో నిట్ డైరక్టర్‌పై అవినీతి ఆరోపణలు రావడం నిట్ ప్రతిష్ఠపై ప్రభావం చూపింది. సస్పెండైన నిట్ డైరెక్టర్ స్థానంలో నాగపూర్ నిట్ డైరెక్టర్ ప్రమోద్ పడోలేను ఆరు నెలలు ఇన్‌చార్జిగా నియమించారు. ఆ గడువు ముగియడంతో దానిని మరో ఆరు నెలలు పొడిగించారు. ఈలోగా డైరెక్టర్ నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చారు. డైరెక్టర్ నియామక ప్రక్రియ మినహా మిగిలిన తంతు ముగిసింది. ఇది జరుగుతున్న తరుణంలోనే జరిగిన బోర్డు ఆఫ్ గవర్నెన్స్ సమావేశంలో ఫ్యాకల్టీ కొరత కారణంగా ఏపీ నిట్ సీట్లను తగ్గించే ప్రతిపాదన రావడం, ఇన్‌చార్జి డైరెక్టర్ అంగీకరించడంతో విద్యార్థులకు తీరని అన్యాయం జరిగింది.

అభయన్స్‌లో ఎంటెక్

నిట్‌లో ఎంసీఏ ప్రారంభిద్దామని గతంలో నోటిఫికేషన్‌లు ఇచ్చి ప్రక్రియ పూర్తయిన తర్వాత కోర్సు ప్రారంభించకుండానే ఎత్తేశారు. నిట్‌లో ఎంటెక్ ఉంది. దీని కింద 85 సీట్లు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం నుంచి ఎంటెక్‌ను అభయన్స్(హోల్డ్)లో ఉంచారు. గతేడాది కేవలం పదిమంది మాత్రమే ఎంటెక్‌లో చేరడం ఒక కారణంగా చూపించి ఎంటెక్‌ను అభయాన్స్‌లో ఉంచారు.

నిట్‌కు మరో 50 ఎకరాలు

ఏపీ నిట్‌కు గతంలో 176 ఎకరాలు కేటాయించారు. అప్పటికే ఈ భూముల్లో ఉన్న విమానాశ్రయ రన్‌వే పోగా 150 ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే ఈ భూముల్లో 110 ఎకరాల్లో కాంక్రీట్ నిర్మాణాలు ఉన్నాయి. ఫ్యాకల్టీ క్వార్టర్లు, అదనపు హాస్టళ్ల నిర్మాణాలు వంటి వాటి కోసం మరో 50 ఎకరాల భూమి అవసరం. ఈ మేరకు ఏపీ నిట్ ద్వారా ప్రతిపాదనలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శికి, ఇతర ఉన్నతాధికారులకు పంపించారు. ఏపీ నిట్‌కు చేరువలో విమానాశ్రయ భూములు అందుబాటులో ఉన్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాల నిమిత్తం ఏపీ నిట్‌కు అదనపు భూములు ఇచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఉన్నత విద్యామండలి పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ తదితరులు ఇప్పటికే మూడు సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. భూ కేటాయింపు ప్రక్రియ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఫ్యాకల్టీ లేకపోవడమే కారణం

ఏపీ నిట్‌లో ప్రస్తుతం 2,300 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. కేంద్ర ఉన్నత విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం 12 మంది విద్యార్థులకు ఒక ఫ్యాకల్టీ ఉండాలి. కనీసం 15 మంది విద్యార్థులకు ఒక ఫ్యాకల్టీ ఉన్నా నాణ్యమైన విద్యను అందించగలరు. ప్రస్తుతం ఏపీ నిట్‌లో 43 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్నారు. 120 మంది అడహాక్ ఫ్యాకల్టీ ఉన్నారు. కొత్త ఫ్యాకల్టీలను శాశ్వత ప్రాతిపదికన నియమించకపోవడంతో 150 మంది విద్యార్థులను కూడా ఒకే తరగతిలో ఉంచి విద్యను బోధించే పరిస్థితి వచ్చింది. ఏపీ నిట్ ఏర్పాటు సమయంలో 480 సీట్లు కేటాయించారు. వరంగల్ నిట్‌లో ఉన్న సూపర్ న్యూమరరీ సీట్లు 120 సీట్లను ఏపీ నిట్‌కు ఇచ్చారు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 150 సీట్లు వచ్చాయి. గత విద్యాసంవత్సరం వరకు ఈ దామాషాలోనే సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగింది. ఈ విద్యాసంవత్సరంలో 270 సీట్లు తగ్గాయి.

ఫ్యాకల్టీ వస్తే సీట్లు పెరుగుతాయి

ఏపీ నిట్‌లో 130 నుంచి 140 మంది ఫ్యాకల్టీలను శాశ్వత ప్రాతిపదికన నియమించే ప్రక్రియ కొనసాగుతోంది. వీరు వస్తే సీట్లు పూర్వం మాదిరిగానే వచ్చే అవకాశం ఉంది. ఎంటెక్ కోర్సులో చేరడానికి ఆసక్తి చూపే సంఖ్య తగ్గడం వల్లే అభయాన్స్‌లో ఉంచాం. విద్యార్థులు నష్టపోకుండా బోర్డు ఆఫ్ గవర్నెన్సు సమావేశంలో మాట్లాడి నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉంది.

– దినేష్ పి.శంకరరెడ్డి, ఇన్‌చార్జి డైరెక్టర్, ఏపీ నిట్

పీహెచ్‌సీ కాంట్రాక్టు ఉద్యోగుల హర్షం



సీఎం చిత్రపటం వద్ద సంతోషం వ్యక్తం చేస్తున్న గణపవరం పీహెచ్‌సీ రెగ్యులర్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

గణపవరం (నిడమర్రు): నిజమైన ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గణపవరం పీహెచ్‌సీ కాంట్రాక్ట్ ఉద్యోగుల నేత మాదాసి యోహాన్ అన్నారు. గణపవరం పీహెచ్‌సీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యోహాన్ మాట్లాడుతూ పాదయాత్రలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని.. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆ ఫైల్‌పై సంతకం చేసి ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగి కుటుంబం ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యు.ఎస్తేరు మేరీ, బి.శ్రీనివాస్, ఎ.కెంపురత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు పెంచేలా చర్యలు

కేంద్ర వ్యవసాయ శాఖ కమిషనర్ పీకే సింగ్



గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్లాంటేషన్ డ్రైవ్‌లో ప్రసంగిస్తున్న కేంద్ర వ్యవసాయశాఖ కమిషనర్ పీకే సింగ్

చింతలపూడి: దేశంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ పీకే సింగ్ పేర్కొన్నారు. చింతలపూడి మండలం సీతానగరం గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీలో గురువారం ఏర్పాటు చేసిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో ఆయన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన రైతుల సదస్సులో మాట్లాడుతూ వంట నూనెల కోసం ఇతర దేశాలపై ఆధార పడకుండ దేశీయంగా పామాయిల్ సాగును విస్తరించి ఉత్పత్తిని ప్రోత్సహించడానికి రైతులతో సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2025–26 నాటికి ఆయిల్ పామ్ ఉత్పత్తి కింద 6.5 లక్షల హెక్టార్లలో అదనంగా విస్తీర్ణం పెంచడానికి ప్లాంటేషన్ డ్రైవ్ ఉపయోగ పడుతుందని అన్నారు. ధరల హెచ్చుతగ్గులను దృష్టిలో పెట్టుకోకుండా పామాయిల్ విస్తీర్ణం పెరగడానికి రైతులు సహకరించాలని కోరారు.

మద్దతు ధర పెంచకుండా తోటలు పెంచమంటే ఎలా?: ఎంపీ

దేశంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేలా పామాయిల్ సాగును జాతీయ వంట నూనెల మిషన్‌లో కేంద్రం చేర్చినట్లు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పామాయిల్ విస్తీర్ణం 40 లక్షల హెక్టార్లకు పెంచుకోగలిగితే ఇతర దేశాల నుండి ఒక్క కేజీ నూనె కూడ దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 8 లక్షల హెక్టార్ల వరకు విస్తరించుకోవడానికి అవకాశం ఉందని, ప్రస్తుతం 2 లక్షల హెక్టార్లలో సాగుచేస్తున్నట్లు చెప్పారు. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న వంట నూనెలపై కనీసం 20 శాతం సుంకం విధించినా ఇక్కడ పండించిన పంటకు డిమాండ్ ఏర్పడి టన్నుకు రూ.15 నుంచి 16 వేలు వస్తుందని అన్నారు. పామాయిల్‌కు మద్దతు ధర ప్రకటించకుండా రైతులు తోటలు పెంచే పరిస్థితిలో లేరని తెలిపారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి దృష్టికి తీసుకు వెళ్ళి రైతులకు న్యాయం చేయాలని సింగ్‌ను ఎంపీ కోరారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జాతీయ ఆయిల్ ఫాం పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్, సీఈఓ సౌగత్ నియోగి, జనరల్ మేనేజర్ మహంతి రమేష్, డీజీఎంలు స్వీటీ రఘు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు వేతనాలు చెల్లించాలి



ఈఈకి వినతిపత్రం అందిస్తున్న మీటర్ రీడర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు జూలై నెల వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఈపీడీసీఎల్ అధికారులను మీటర్ రీడర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మీటర్ రీడర్లు అరకొర వేతనాలతో జీవిస్తున్నారని, అయినా ఇచ్చే వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకపోవడం వల్ల మీటర్ రీడర్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డోర్ లాక్, మిస్ మాచ్, ఇతర టెక్నికల్ కారణాలు సాకుగా చూపి ఇచ్చే వేతనంలో కూడా కోత విధిస్తున్నారని ఫలితంగా మీటర్ రీడర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీటర్ రీడర్లకు కాంట్రాక్టర్లు మొబైల్స్ ఇవ్వకుండా, రీఛార్జి చేయించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మీటర్ రీడర్ల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థలు నిర్దేశించిన రేట్లు ఇవ్వకుండా కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని విమర్శించారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా విద్యుత్ సంస్థల్లో మీటర్ రీడర్స్ ఎనలేని సేవలందిస్తున్నారని, కానీ సంస్థ మాత్రం మీటర్ రీడర్లను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్) ఎం.ఝాన్సీకి వినతిపత్రం సమర్పించారు.

శ్రీవారి పథకాలకు రూ. 10.11 లక్షల విరాళం



దాత కిషోర్‌బాబు కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు ఇద్దరు భక్తులు గురువారం రూ. 10,11,000లు విరాళంగా అందజేశారు. అందులో భాగంగా బాతుల కిషోర్‌బాబు, వాణి దంపతులు శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి వారి కుమారుడు బాతుల ధీర పేరున రూ. 4,55,500లు, మరో కుమారుడు ధ్రువ పేరున గోసంరక్షణ పథకానికి రూ. 4,55,500లు జమచేశారు. ఆ చెక్కును ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావుకు అందించగా, ఆయన దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందించి, అభినందించారు. అలాగే కేసరిపల్లికి చెందిన జాస్తి మధుకల్యాణ్ నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,000లు ఆలయ కార్యాలయంలో జమచేయగా, సీనియర్ అసిస్టెంట్ మద్దాల శ్రీను దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

హుండీ చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

వీరవాసరం: హుండీ పగలగొట్టి పారిపోయిన ముద్దాయిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని వీరవాసరం ఎస్సై రమేష్ గురువారం తెలిపారు. కొణితివాడ శివారులో ఉన్న పుంతలో మునలమ్మ అమ్మవారి ఆలయంలో ఉన్న డిబ్బిని ఎర్రమిల్లి సతీష్ బాబు పగలగొట్టి చోరీకి పాల్పడ్డాడు. గతంలో జరిగిన ఈ సంఘటనలో సతీష్ బాబును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చామన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షల దరఖాస్తులకు 25 వరకు గడువు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25 వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 20న జరుగుతుందన్నారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలు లభిస్తే ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు హాస్టల్ వసతి లభిస్తుందన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు జవహర్ నవోదయ విద్యాలయాల గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించి ఎక్కువ మంది ప్రవేశ పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని సూచించారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

టి.నరసాపురం : వివాహిత మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని ఏపుగుంటకు చెందిన చాపలమడుగు సౌజన్య అత్తను బెదిరించాలని క్షణికావేశంలో కలుపు మందు తాగింది. అదే సమయంలో పక్కనే ఉన్న తన కుమార్తె అక్షర (2) కలుపుమందు డబ్బా నోటిలో పెట్టుకుంది. విషయం తెలిసిన సౌజన్య భర్త రమేష్ ఇద్దరిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె 15వ తేదీ రాత్రి మృతి చెందింది. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం, భర్త రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఏలూరు–కైకలూరు రోడ్డు రెండు నెలల్లో పూర్తి

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



రోడ్డు పనుల ప్రగతిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

ఏలూరు రూరల్ : ఏలూరు–కైకలూరు రోడ్డు రెండు నెలల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం సాయంత్రం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి శ్రీపర్రు వద్ద వంతెన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ కైకులూరు రోడ్డు అభివృద్ధి చేయలేదని గుర్తుచేశారు. 70 ఏళ్ల నుంచి శ్రీపర్రు కాజ్‌వే వద్ద వంతెన నిర్మాణం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన కైకులూరు రోడ్డు, వంతెనకు మహానేత వైఎస్సార్ వారధిగా నామకరణ చేసి ప్రజలకు అంకితమిస్తామని వెల్లడించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జి.జాన్ మోషే మాట్లాడుతూ ఇప్పటికే 6.7 కిలోమీటర్ల బీటీ రోడ్డు, 2.9 కిలోమీటర్ల సీసీ రోడ్డు, వంతెన నిర్మాణం, 5 కల్వర్టుల నిర్మాణం పూర్తిచేశామని చెప్పారు. మరో కల్వర్టుతో పాటు మరికొంత దూరం సీసీ, బీటీ రోడ్లు అభివృద్ధి చేయాల్సిఉందన్నారు. వర్షాల వల్ల రోడ్డు పనులకు అంతరాయం ఏర్పడుతుదని హెచ్ఈఎస్ సంస్థ గుత్తేదారులు తెలిపారు.


రివిట్‌మెంట్‌కు ప్రణాళిక

తమ్మిలేరు గట్టుకు గండి పడకుండా రివిట్‌మెంట్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధికారులకు సూచించారు. గతంలో వంతెన కింద నుంచి వరదనీరు ఉధృతంగా పారడంతో తమ్మిలేరు గట్టుకు గండి పడి వందలాది ఎకరాల పంటచేలు ముంపుబారిన పడ్డాయని వైఎస్సార్‌సీపీ నాయకులు తేరా ఆనంద్, మండల కొండలరావు, కొరపాటి శ్రీరామ్ ప్రభుదేవ్, పలువురు రైతులు చెప్పడంతో ఎమ్మెల్యే స్పందించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, ఆర్ అండ్‌బీ ఈఈ వైవీ కిషోర్ బాబూజీ, ముంగర సంజీవ్‌కుమార్, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

మందలించాడని మేనమామపై దాడి

పెదవేగి: తల్లిని కొట్టాడని మందలించిన పాపానికి మేనమామపై మేనల్లుడు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన పెదవేగి మండలం రాయన్నపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెనుబోయిన రాంబాబు, విజయరాయికి చెందిన కొలుసు రాజమ్మ అన్నాచెల్లెళ్ళు. రాజమ్మను ఆమె కుమారుడు లక్ష్మణరావు కొట్టాడు. ఆ రోజున రాంబాబు వెళ్ళి మీ అమ్మను మరోసారి కొడితే ఊరుకునేది లేదని లక్ష్మణరావును మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న మేనల్లుడు లక్ష్మణరావు మేనమామను చంపాలని ఎదురు చూస్తున్నాడు. బుధవారం రాత్రి రాంబాబు, తన చెల్లెలైన రాజమ్మ దగ్గరకు విజయరాయి వెళ్ళి, తిరిగి ఇంటికి వస్తుండగా లక్ష్మణరావు ద్విచక్రవాహనంపై మరో ఇద్దరితో కలిసి బయలు దేరాడు. మధ్య దారిలో దాడి చేయాలనుకున్నా వీలుపడలేదు. రాత్రి ఎనిమిదిగంటల సమయానికి ఇంటికి చేరుకున్న రాంబాబు ద్విచక్రవాహనం దిగి ఇంట్లోకి వెళ్ళడానికి ప్రయత్నిస్తుండగా లక్ష్మణరావు కత్తితో నరికి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయిన రాంబాబును చూసి, కుటుంబసభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదవేగి ఎస్ఐ తెలిపారు.

మహిళ దారుణ హత్య



రక్తపు మడుగులో మృతురాలు ఓలేటి మణి

ముసునూరు: మండలంలో మహిళ దారుణ హత్య సంచలనం సృష్టించింది. ముసునూరు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిల్లబోయినపల్లికి చెందిన ఓలేటి రవీంద్ర భార్య మణి(30) గురువారం వరి పొలంలో కలుపు తీసేందుకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి భోజనం చేస్తున్న ఆమెను ఎవరో గుర్తు తెలియని వ్యక్తి నరికి పారిపోయాడని భర్త కేకలు వేస్తూ చుట్టు పక్కల వారిని పిలిచాడు. వారు వచ్చేసరికే ఆమె ప్రాణం పోయింది. తలపైన బలమైన గాయం కావడంతో ఆమె మృతి చెందింది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తే హత్య చేసి ఉంటాడని అందరూ అనుమానిస్తున్నారు. మృతురాలికి ఇంటర్ చదివే కుమార్తె, తొమ్మిదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్ కుమార్ గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



బుట్టాయగూడెం సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం : ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందికి సంబంధించిన రికార్డులను పీఓ పరిశీలించారు. అనంతరం అన్ని వార్డులను తిరిగారు. ఫిజియోథెరపీ, నవజాతి సంరక్షణ కేంద్రం, రోగుల వార్డులు తిరిగి అందుతున్న వైద్యు సేవలపై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కిషోర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రభుత్వం పొందుపరచిన అన్ని జబ్బులకు వైద్యసేవలు అందించేలా కృషి చేయాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు సంబంధించి తక్షణ వైద్యసేవలు అందించాలన్నారు. అలాగే ఆసుపత్రిలోని 25 మంది ఇన్ పేషెంట్స్ వైద్యం పొందుతున్నారని, గురువారం సుమారు 75 మంది ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పొందినట్లు వైద్యులు పీఓకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జనార్ధన్, హేమత్, ప్రశాంత్, వసుంధర, సౌమ్య, వినిత, ఇమిమా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని కాపాడిన మత్స్యకారులు



సిద్ధాంతం గోదావరి వద్ద వృద్ధుడితో మాట్లాడుతున్న మహిళా పోలీసు

పెనుగొండ: సిద్ధాంతం వశిష్ఠ గోదావరిలో ఆత్మహత్య యత్నం చేసిన వృద్ధుడిని మత్స్యకారులు కాపాడారు. గురువారం వీరవాసరం మండలం తోకలపూడికి చెందిన వి.మంగయ్యనాయుడు సిద్ధాంతం కేదారీఘాట్ వద్దకు చేరుకొని, కొంత సమయం అటూ ఇటూ పచార్లు చేసి ఒక్కసారిగా గోదావరిలో దూకేశాడు. అక్కడే ఉన్న మత్స్యకారులు ఒక్కసారిగా గోదావరిలో దూకి రక్షించి, గట్టుకు చేర్చారు. సిద్ధాంతం మహిళా పోలీసు సంధ్యా జ్యోతి వృద్ధుడి వివరాలు సేకరించారు. అతను వివరాలు తెలిపినా ఆత్మహత్యాయత్నానికి కారణాలు చెప్పకపోవడంతో వృద్ధుడికి సర్దిచెప్పి బంధువులకు సమాచారం అందించారు. పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు వృద్ధుడి బంధువులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.


యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం గునుపూడికి చెందిన నల్లం దేవహర్ష కన్పించడం లేదంటూ తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు గురువారం చెప్పారు. ఇంటర్ చదువుతున్న దేవహర్ష ఈ నెల 16న కళాశాలకు వెళ్లకుండా అదే ప్రాంతంలో ఉంటున్న నాన్నమ్మ ఇంటికి వెళ్లాడు. బుధవారం రాత్రయినా దేవహర్ష ఇంటికి రాకపోవడంతో తండ్రి శ్రీనివాస్ పరిసరప్రాంతాల్లో వెదికినా ఆచూకీ దొరకలేదు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మణప్పురంలో చోరీకి యత్నం

ప్రకాశం చౌక్ ప్రాంతంలోని మణప్పురం గోల్డ్ ఫైనాన్స్‌లో ఈ నెల 16న గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి యత్నించారని ఆ సంస్థ హెడ్ సారరంజన్ మహంతా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై చెప్పారు. బుధవారం రాత్రి ఒంటిగంట సమయంలో దొంగతనానికి యత్నించగా ఆఫీసు వద్ద ఏర్పాటుచేసి సాంకేతిక పరిజ్ఞానంతో విషయం గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశామరన్నారు.

నేషనల్ వర్క్‌షాప్‌నకు పెనుమర్రు సర్పంచ్



కవురు గోపి, పెనుమర్రు సర్పంచ్

యలమంచిలి : స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అనే అంశంపై ఈ నెల 21 నుంచి 23 వరకు జమ్మూ–కశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌లో జరగనున్న జాతీయస్థాయి వర్క్‌షాప్‌నకు యలమంచిలి మండలంలోని పెనుమర్రు సర్పంచ్ కవురు గోపికి ఆహ్వానం వచ్చినట్లు ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో వ్యక్తిగత అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి, పర్యావరణ అభివృద్ధి, సుస్థిర అభివృద్ధిపై జాతీయస్థాయిలో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు.

నేడు భీమవరంలో ఆట్యా-పాట్యా సెలెక్షన్స్

సాక్షి, భీమవరం: ఆట్యా–పాట్యా జూనియర్స్ విభాగంలో బాలబాలికల జిల్లా టీం సెలక్షన్స్ ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన రామచంద్రరాజు, జి.కిరణ్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎమ్ స్కూల్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సెలక్షన్స్ నిర్వహిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీల్లో కర్నూల్‌లో జరిగే జూనియర్ రాష్ట్రస్థాయి ఆట్యా–పాట్యా టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయసు ధ్రువీకరణ ప్రతంతోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని ప్రకటనలో తెలిపారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ



జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో అర్ధరాత్రి సమయంలో ట్యాంకర్ లారీ అదుపు తప్పి రహదారి పక్కన దుకాణంలో దూసుకుపోయింది. అర్ధరాత్రి కావడంతో షాపులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దుకాణంలోని ఫ్రిజ్‌లు, సామన్లు ధ్వంసమయ్యాయి.

శ్రీదేవి పుంత వాసులకు పట్టాల పంపిణీ


శ్రీదేవి పుంత వాసులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని 16వార్డు జువ్వలపాలెం శ్రీదేవి పుంతలో నివసిస్తున్న 96 కుటుంబాలకు ఇంటి స్థల పట్టాలను ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి శ్రీదేవి పుంత వాసులు నివాసం ఉంటున్న ఇంటి స్థలాలకు సంబంధించి పట్టాల కోసం పోరాడుతున్నారన్నారు. మొదటిసారి తాను ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో ఇక్కడి ప్రాంతంలో రోడ్లు నిర్మించామని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు వారికి ఇంటి పట్టాలు అందజేయడం సంతోషంగా ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలోని ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పిస్తామని మంత్రి కొట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుండుమోగుల బలుసులు, బండి నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంగన్‌వాడీల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ నేతలు గురువారం పట్టణంలోని కొట్టు సత్యనారాయణ నివాసం వద్ద కలిసి తమ సమస్యలను విన్నవించారు. జిల్లా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఝాన్సీ, కళ్యాణీలు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేస్తున్న అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం, పెన్షన్, విశ్రాంత బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. సంక్షేమ పథకాలు కూడా అంగన్‌వాడీలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. అరకొరగా వస్తున్న జీతం, పెరిగిన ధరలు వల్ల కనీస పోషణకు కూడా ఇబ్బంది అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఇవ్వాల్సిన బిల్లులు, టీఏ బిల్లులు సక్రమంగా చెల్లించాలని కోరారు. ఆయా సమస్యలతో కూడిన వినతిపత్రంను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కర్రి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ నాయకులు శ్యామల కుమారి, అనురాధ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత సూచనలు పాటించాలి

వీరవాసరం: రహదారి ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత సూచనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. వీరవాసరం మండలం రాయకుదురులో గురువారం చట్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ సుబ్బరాజు రహదారిపై ప్రయాణం చేస్తున్నప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పోలీసులకు, ప్రజలకు మధ్య ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్టు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు నడుచుకోవాన్నారు. కార్యక్రమంలో ఎస్సై పి.రమేష్, గెడ్డం భాస్కరరావు, సర్వేశ్వరరావు, పీవీ రామకృష్ణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, తాడాల దుర్గా ప్రసాద్, తోట పెద్దిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీటీడీ సభ్యునిగా శేషుబాబు నియామకంపై హర్షం


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన మాజీ ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు

తణుకు టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ బోర్డు సభ్యునిగా మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబును నియమించడం పట్ల గౌడ్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల టీటీడీ ట్రస్టీ బోర్డు నియామకంలో గౌడ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ శేషుబాబును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గౌడ్ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ సంఘం కార్యదర్శి వెలగన శ్రీనివాస్, తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, గౌడ్‌సంఘం నాయకులు మైనం పాము, కట్టా రాజేష్, కిషోర్, కామన మునిస్వామి, దాసరి కృష్ణ, రాజులపాటి శ్రీనివాసు, మోతుకూరి త్రిమూర్తులు, పోతురాజు, సెనగన ప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు


ఆన్‌లైన్ డ్రాయింగ్ పోటీల్లో ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థినులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వీరమళ్ళ జ్యోతి వైష్ణవి, బందిల హేమతేజశ్రీలు డ్రాయింగ్ పోటీల్లో ప్రశంసా పత్రాలు లభించాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్ ఎడ్యుకేషన్, రీసెర్చ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ జెనెటిక్స్ సంస్థలు పర్యావరణ సమాచారం, అవగాహన, సామర్థ్యం పెంపుదల, జీవనోపాధి అనే అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభకనబర్చి ఈ ప్రశంసా పత్రాలు అందుకున్నట్టు హెచ్‌ఎం సీహెచ్.చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

వైఎస్సార్ బీమా అందజేత


కొత్తపాడులో శ్రీను కుటుంబానికి బీమా నగదు అందజేస్తున్న నాయకులు, తదితరులు

ఇరగవరం: మండలంలోని కొత్తపాడు గ్రామంలో ఇటివల మృతి చెందిన గుబ్బల శ్రీను అనే వ్యక్తి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ పరామర్శించారు. అగష్టు నెల 16వ తేదిన గుబ్బల శ్రీను మృతి చెందడం జరిగింది వేంటనే వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదు రూ .10వేలు అందజేశారు. మిగిలిన రూ.90వేలు వారి అకౌంట్‌లో త్వరలో జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బొక్క శ్రీను, దొంగ శ్రీను, కార్యదర్శి శకుంతల, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రత్యూష పాల్గొన్నారు.

జర్నలిస్టుల భద్రతకు రక్షణ చట్టం చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: జర్నలిస్టుల భద్రతకు రక్షణ చట్టం చేయాలని ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు డి.సోమసుందర్ అన్నారు. సేవ్ జర్నలిజం డే సందర్భంగా గురువారం తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలంటే జర్నలిస్టుల వృత్తికి, వారి భద్రతకు అండగా ఉండాల్సిన బాధ్యత పౌర సమాజంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తణుకు టౌన్: జర్నలిస్టలకు బీపీఎల్, అక్రిడేటీషన్ కార్డులతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ పథకాలు అందించాలని ఏపీయూడబ్ల్యూజే నేతలు కోరారు. గురువారం సేవ్ జర్నలిజం పేరుతో జాతీయ స్థాయి పిలుపు మెరకు తణుకులో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకోండి

ఉండి : అక్క చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ చేయూత సంక్షేమ పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఏవీ అప్పారావు కోరారు. ప్రస్తుతం 2023 సంవత్సరానికిగాను దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు.

టమాటా.. కాస్త ఊరట

- సామాన్యులకు అందుబాటులో ధర
- కిలో 50 నుండి 60కే లభ్యం
- పెరిగిన విక్రయాలు


మార్కెట్‌లో టమాటాలు

పెంటపాడు: అధిక ధరలతో వినియోగదారులకు చుక్కలు చూపించిన టమాటా ధర ప్రస్తుతం సామాన్యులకు అందుబాటులో వస్తోంది. రెండు నెలలుగా కిలో టమాటా ధర మూడంకెల పైనే కొనసాగింది. క్రమేపీ రూ. 130 నుంచి పెరుగుతూ రూ.180 వరకు ఎగబాకి వినియోగదారుల గుండెల్లో గుబులు పుట్టించింది. అంత ధరకు కొనలేక చాలా మంది టమాటా వినియోగమే మానుకొన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొన్న రాష్ట్ర ప్రభుత్వం భారీ సబ్సిడీతో జిల్లాలో రైతుబజార్ల ద్వారా 55 టన్నుల టమాలను ప్రజలకు అందించింది. తద్వారా రూ. 50కే అందించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకొన్నారు. దడ పుట్టించిన టమాటా ధరలు క్రమేపీ తగ్గుతూ ప్రస్తుతం రెండెంకెలకు రావడంతో విక్రయాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం రైతు బజార్లలో రూ. 50, బయట మార్కెట్‌లో రూ. 60కి విక్రయిస్తున్నారు. ఈ ధరలు మరింత దిగివస్తాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలోని తాడేపల్లిగూడెంకు పలు ప్రాంతాలైన చిత్తూరు, మదనపల్లి, పుంగనూరు నుంచి టమాటాలు వస్తుంటాయి. దీంతో పాటు తెలంగాణాలోని మెదక్, వికారాబాద్, జిల్లాలలో టమాటా దిగుబడి కొన్నాళ్లుగా పెరిగింది. దీంతో మార్కెట్‌లో లభ్యత పెరిగి టమాటా ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఏది ఏమైనా టమాటా రెండు నెలల పాటు సామన్యులను తన గురించి చెప్పుకొనేలా చేసింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో టూ టౌన్‌లోని కె.ఎస్.రోడ్డు మార్గంలో తాళ్ళముదునూరుపాడులో డ్రైయినేజీ పనులు జరుగుతున్నందున, విద్యుత్ మరమ్మతుల నిమిత్తం 11కేవీ మార్కెట్ ఫీడర్, 11కేవీ ఎంహెచ్‌క్యూ పెంటపాడు ఫీడర్‌లకు సంబంధించి ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. తాళ్ళముదునూరుపాడు పరిసర ప్రాంతాలు, పెంటపాడులో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మానవత శాంతి ర్యాలీ

పెంటపాడు: మానవత ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం పెంటపాడులో నిర్వహించబోయే మానవత భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు పెంటపాడు ఎస్టీవీఎస్ హిందూ హైస్కూల్ నుంచి ప్రారంభమై గాంధీబొమ్మ సెంటర్, కళాశాల సెంటర్, ప్రభుత్వ బేసిక్‌స్కూల్ ఈ ర్యాలీ సాగుతుందన్నారు. ఈ ర్యాలీలో మానవత సభ్యులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తణుకు టౌన్: జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలలో పని ఒప్పంద (కాంట్రాక్ట్) పద్ధతిపై పని చేస్తున్న అధ్యాపకులు తమ తమ సేవలను పునరుద్ధరణ (రెన్యువల్) చేసుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్, తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్ తెలిపారు. ఈనెల 19వ తేదీలోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందజేయాలని కోరారు. ఈనెల 23వ తేదీన కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకానికి సంబంధించి జిల్లా ఎంపిక కమిటీ సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. మిగిలిన వివరాల కోసం సీహెచ్ ఏడుకొండలు 94412 57279ను సంప్రదించాలన్నారు.

చేపల చెరువు వేలం

అత్తిలి: మండలంలోని కె సముద్రపుగట్టు గ్రామ పంచాయతీ పరిధిలోగల ఉత్పాదక చేపల చెరువులో ఫలసాయం అనుభవించే హక్కుకు గురువారం వేలంపాట నిర్వహించినట్లు ఈవోపీఆర్డీ ఎం శ్రీనివాసరావు తెలిపారు. 1433 ఫసలీ నుంచి 1435 ఫసలీ కాలం మూడు సంవత్సరాలకు గాను రూ. 22,00,000లు వేలం పాటు పాడుకున్నారని చెప్పారు. గతంలో జరిగిన వేలం పాటలో మూడేళ్ల కాలపరిమితికి రూ. 18,20,000లు పాడుకోగా, ఇప్పుడు గతానికి కంటే అదనంగా రూ. 3,80,000లు ఆదాయం గ్రామపంచాయతీకి సమకూరిందన్నారు. వేలం పాటలో సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ యాళ్ల అనిత, కార్యదర్శి సుజాత, వార్డు సభ్యులు, వేలం పాతపాటదారులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేత


అత్తిలి మండలం కొమ్మర పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: పాఠశాల అభివృద్ధికి విశ్రాంత ఐఏఎస్ అధికారిణి ఓగిరాల ఛాయారతన్ అందిస్తున్న సహాయ సహకారాలు మరువరానివని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె ధనసూకరాజు అన్నారు. అత్తిలి మండలం కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలకు కొమ్మర గ్రామానికి చెందిన రిటైర్డు ఐఏఎస్ అధికారిణి ఛాయారతన్ ఆర్థిక సహకారంతో రూ. 26,305లు విలువగల క్రీడా సామగ్రిని గురువారం పాఠశాలకు అందజేసారు. ఈసందర్భంగా పదిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని రూ. 5 వేలు నగదు బహుమతిని అందజేశారు. ప్రతీఏడాది పదో తరగతి పరీక్షలలో 80 శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థులందరికీ రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతిని అందజేస్తామని ఛాయారతన్ ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంతెన రామసీత, ఉపసర్పంచ్ మన్యం దానారావు, పాలూరు సొసైటీ అధ్యక్షుడు కునాధరాజు శ్రీహరిరాజు, పీఈటీ వైఎస్సార్ సోమయాజులు, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు


తణుకులో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

తణుకు అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు భావి తరాలకు స్ఫూర్తి నింపేలా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. తణుకు బ్యాంక్ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధుల ఉద్యానవనంలో నూతనంగా ఆవిష్కరించబడిన తణుకుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు సునీల్‌కుమార్ గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ పోరాటంలో తణుకును చరిత్ర పుటల్లోకెక్కించిన మహానుభావులను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు మంతెన యోగేంద్రబాబు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, నాయకులు రేలంగి రాంబాబు, షేక్ ఏకే జిలాని, ఎస్.సురేష్‌రెడ్డి, చింతలపూడి సూర్యనారాయణ, పైడి సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు టౌన్: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యువ నాయకుడు కారుమూరి సునీల్ కుమార్ చెప్పారు. పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆదేశాల మేరకు గురువారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని శ్రీ కేశవ స్వామి ఆలయంలో కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, జిల్లా వైఎస్సార్‌సీపీ డాక్టర్ విభాగం అధ్యక్షుడు దాట్ల సుందరరామరాజు, ఎంపీటీసీ కాళ్ల సన్యాసిరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, ఏఎంసీ డైరెక్టర్ వై విజయామూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ సబ్బరపు సుజాతా దేవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల మణికంఠ, ఆలయ ఈవో ఎం వెంకట్రావు, నాయకులు ములగాల శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

అలంపురంలో జీవామృత కిట్ల పంపిణీ


జీవామృతం కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

పెంటపాడు: జీవామృత తయారీపై రైతులు ఆసక్తి పెంచుకొని ప్రధానంగా ప్రకృతివ్యవసాయ రైతులు చీడపీడలను నివారించుకోవాలని ప్రకృతి వ్యవసాయ గూడెం కోఆర్డినేటర్ గద్దే వెంకటరత్నం పేర్కొన్నారు. పెంటపాడు యూనిట్ పరిధిలో అలంపురం గ్రామంలో రైతులకు గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భీజామృతం, జీవామృతం తదితర ద్రావణాలు వల్ల చీడపీడలను నివారించుకొనే విధానం రైతులకు తెలిపారు. జీవామృతం తయారు చేసే విదానాన్ని రైతులకు తెలిపారు. లింగాకర్షక బుట్టల వల్ల ప్రయోజనం, కాండం తొలుచుపురుగును ఏ విధంగా గుర్తించాలో రైతులకు వివరించారు. సార్వా పంటకు ప్రధానంగా చీడపీడలు నివారించే శక్తి కేవలం భీజామృతానికే ఉందన్నారు. ప్రధానంగా విత్తనశుద్ధి చేసుకొంటే పంటను అధికశాతం చీడపీడల నుంచి రక్షించుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి గుమ్మళ్ళ వీర్రాజు, ప్రకృతి వ్యవసాయ గ్రామాల వలంటీర్లు, ప్రతినిధులు గ్రామ రైతులు, ఐసీఆర్పీలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్యంతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు


తణుకు మహిళా కళాశాలలో జరిగిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రోహిణీ నాయుడు

తణుకు టౌన్: అనుకున్నది సాధించాలనే లక్ష్యంతో ప్రయత్నం చేస్తే మహిళలు ఏదైనా సాధించగలరని, మహిళా సాధికారత అనేది ఆత్మస్థైర్యంతో ఏర్పడుతుందని హైదరాబాద్‌కు చెందిన సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ రోహిణీ నాయుడు చెప్పారు. గురువారం తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రోహిణీ నాయుడు మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడ గలిగే ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ లింగ వివక్ష కొనసాగుతున్నప్పటికీ అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంటర్ ప్రెన్యూర్ కూచిపూడి వెంకట్, కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, వీజీఎస్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనా సాయి, వైస్ ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

నరసాపురం రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం 10వ వార్డులో ఇటీవల అనారోగ్యానికి గురైన రాజోలు రాజేష్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షల చెక్కు మంజూరైంది. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఈ చెక్కును లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు ప్రసాదరాజు అందజేశారు. రాజేష్ కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక పిలకలతోనే దిగుబడి సాధ్యం


పొలంబడిలో వరి పిలకల దశను పరిశీలిస్తున్న దృశ్యం

ఆకివీడు : వరి మొక్క నాటిన పిదప మొక్కకు అధిక పిలకలు వేసే విధంగా రైతులు కృషి చేయాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య సూచించారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు పొలంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు సూచనలిస్తూ నాట్లు వేసే ముందు మొక్కకూ మొక్కకూ మధ్య 4,6 అంగుళాల ఖాళీ ఉండాలన్నారు. మొక్క పెరుగుతున్న సమయంలో చీడ పీడలు దరికి చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరుతడులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. తడిపొడి విధానంలో వరి సాగు ఉంటే పిలకలు అధికంగా వేస్తుందన్నారు. దబ్బులను మిత్ర, శత్రుపురుగులు ఆశిస్తాయన్నారు. మిత్ర పురుగుల్ని కాపాడుకుంటూ, శత్రుపురుగుల్ని నాశనం చేసే విధంగా చూడాలన్నారు. యాజమాన్య పద్ధతులతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని సీతారామయ్య వివరించారు. మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ. ప్రియాంక మాట్లాడుతూ కుప్పనపూడి గ్రామంలోని పంట భూముల్లో చౌడు శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు చల్లారావు పొలంలో ఎంటీయూ 1121 వంగడం సాగు చేసినట్లు చెప్పారు. సాగులో విత్తన వినియోగం, ఎరువుల వాడకం, పురుగుమందుల వాడకం, పిలకల దశ తదితర అంశాలపై రైతులకు వివరించారు. చౌడు భూముల్లో నీటి సాంద్రత, వినియోగించాల్సిన మందులపై సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ఫ్యామిలీ వైద్యసేవలు

- గ్రామాల్లో ఉచిత వైద్యపరీక్షలు
- ప్రజల్లో హర్షాతిరేకాలు



పెంటపాడులో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వైద్యవిధానం దేశం యావత్తూ హర్షిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఉన్నతికి పథకాలతో పాటు, విద్య, వైద్యం ద్వారా అందిస్తున్న సేవలు మరువలేనివి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం పేదలపాలిట వరంగా మారింది. గ్రామాల్లో ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు, ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకొన్నవారు, గర్భిణులు, బాలింతలకు పరీక్షల నిమిత్తం గతంలో పట్టణాలకు వెళ్లేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం అమలులోకి వచ్చిన తరువాత నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్ల వద్దకు వైద్యులు వచ్చి పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. గతంలో ట్రయల్ రన్ ద్వారా వైద్యాధికారులు స్థానిక పీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తూ గ్రామాల్లో ఇంటింటికి వైద్యపరీక్షలు చేశారు. నేడు వైద్యులు పూర్తిస్థాయిలో ఉండటంతో ప్రత్యేక షెడ్యూల్ ద్వారా గ్రామాల్లో వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో రోగులు ప్రభుత్వ డాక్టర్లు అందించే సేవలకు అలవాటు పడ్డారు. గతంలో గ్రామీణులకు ఎన్ని జబ్బులు చేసినా, పెద్ద జబ్బు వచ్చినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పట్టణాలకు పరుగుపెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నిర్దేశిత సమయంలో గ్రామాల్లో వైద్య బృందం వచ్చి రోగులకు నిశితంగా పరీక్షలు చేసి అందుకు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఈ వైద్య బృందాలు వచ్చేటప్పటికీ విశేష స్పందన కనిపిస్తోంది. ఈ పథకంలో నియోజకవర్గంలో 50కి పైగా గ్రామాల్లో 309 వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో సుమారు 25 వేల మంది వైద్యసేవలు పొందారు. దీంతో పేదలకు ఆరోగ్యంపై భరోసా కలిగింది. మాకు ఏ జబ్బు చేసినా ప్రభుత్వం ఉందిలే అన్న ధీమా వారిలో కనిపిస్తోంది. ఇప్పుడు ప్రభుత్వమే వైద్యులను పంపించి ప్రతీనెలా రక్త, యరిన్, తదితర పరీక్షలు చేయిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గూడెం నియోజకవర్గంలో సుమారు వేల మంది బీపీ, షుగర్ రోగులకు సేవలు అందుతున్నాయి.

ప్రతినెలా పరీక్షలు



ప్రతీనెలా వైద్యబృందం గ్రామానికి వచ్చి రక్త, యూరిన్ పరీక్షలు చేసి మందులు ఇస్తున్నాము. వారంలో ప్రత్యేక షెడ్యూల్ ద్వారా గ్రామాల్లో ఉండి పరీక్షలు చేస్తున్నాము. ప్రజలుకూడా వీటికి అలవాటఅయ్యారు. రిఫరల్ కేసులు కూడా చెక్ చేస్తున్నాం. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్‌లు చేయించుకొన్న వారికి కూడా ప్రత్యేక దృష్టితో చూస్తున్నాం.

– డాక్టర్ తోట రాజేష్, మెడికల్ అధికారి, పెంటపాడు

అందుబాటులో ఉంటున్నాం



గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గ్రామ హెల్త్ క్లినిక్‌లకు వైద్యాధికారులు , ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ రోగులకు సేవలు అందిచడమే కాక గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. రోగ్యశ్రీ చికిత్సలు చేయించుకొన్న రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ ఎస్వీ రమణ, ముదునూరు పీహెచ్‌సీ

ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

ఆకివీడు : ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జునరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు, అడ్రస్‌ల మార్పు, పేరుల్లో లోపాలు వంటివాటిని వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.